సాక్షి ఆదిలాబాద్

శనివారం ၊ 14 ၊ సెప్టెంబర్ ၊ 2024



ఘనంగా నిమజ్జనోత్సవం

జిల్లాలో పలుచోట్ల గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. భక్తులు, యువత, చిన్నారులు డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. 9లో▸

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్ స్థాపనకు సైతం అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. స్థాపన, నిర్వహణకు సహకారం అందించేందుకు గాను ఆసక్తి గల కంపెనీ, ఏజెన్సీ వారు ఈనెల 18 సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తును కార్యాలయ ఇన్‌వార్డు సెక్షన్‌లో అందజేయాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

10 మందికి కారుణ్య పోస్టింగ్



నియామకపత్రాలు అందుకున్న వారితో కలెక్టర్

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో మరణించిన గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వో) కుటుంబీకులకు కారుణ్య నియామకాల కోసం అధికారులు ఈ నెల 6న కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో ఉద్యోగాలు పొందిన 10మందికి పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఇందులో అన్వర్ మాలీక్, కాంబ్లే విశాల్ (జూనియర్ అసిస్టెంట్, పంచాయతీరాజ్), ఎస్.అన్నపూర్ణ, మెట్టు మమత, కె.దామోదర్, రాథోడ్ వందన, షిండే కవిత (ఆఫీస్ సబార్డినేట్, రెవెన్యూ), డి.వర్ష (మెసెంజర్, అగ్రికల్చర్), మంద చిన్ని (స్వీపర్, పాలిటెక్నిక్ కళాశాల, ఆదిలాబాద్), డి.రోజా (స్వీపర్, పాలిటెక్నిక్ కళాశాల ఉట్నూర్) ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ ఖాతాలో జమకావడం లేదా..

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రూ.500లకు ఎల్‌పీజీ సిలిండర్‌ను అందజేస్తుందని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారులుగా ఎంపికై సిలిండర్ పొందిన వారికి ఆధారిత ఆన్‌లైన్ బదిలీ (డీబీటీ) ద్వారా బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ చేస్తున్నట్లు తెలిపారు. ఖాతాలో నాలుగు రోజుల్లో జమ కానట్లైతే 1967 లేదా 180042500333 నంబర్లలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చని ఆమె సూచించారు.

అలరించిన ఫ్రెషర్స్‌డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డీఐఈవో రవీందర్‌కుమార్ మాట్లాడుతూ, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఇందులో ప్రిన్సిపాల్ జాదవ్ గణేశ్‌కుమార్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా కార్యవర్గం



మహిళా కార్యవర్గ సభ్యులతో 'కంది'

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఖరారు చేశారు. గౌరవాధ్యక్షురాలుగా ఆడే శీల, ప్రధాన కార్యదర్శిగా దేశెట్టి ప్రభావతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లత, వైస్ ప్రెసిడెంట్‌గా మంథని సోనియా, కోశాధికారిగా భావన సింగ్, సహాయ కార్యదర్శులుగా తుల్జాపూర్ శోభ, నల్వాల సుమ, ఉపాధ్యక్షులుగా తుమ్మల అన్నపూర్ణ, కాటిపెల్లి సునిత, మెస్రం భాగ్యలక్ష్మి, ఉయికె ఇందిరా, డి.శ్రీలేఖ, సంయుక్త కార్యదర్శులుగా బూర్గుల అనసూయ, సుమన్‌బాయి, పిడుగు ఉమారాణి, నేరెళ్ల లక్ష్మి, ఉష్కమల్ల లలిత, ప్రచార కార్యదర్శులుగా వడ్డనాల శారద, షేక్ జుబేదా, మహ్మద్ జాబీనా, ప్రమీల, ఆడె లలిత, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అలాం రూప రోస్టిన్‌ను నియమించారు.పట్టణంలోని ప్రజా సేవభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డితో కలిసి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ వారికి నియామక పత్రాలను అందజేశారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు.

మతలబేంటో..!

రిమ్స్‌లో తాజాగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్న స్టాఫ్‌నర్స్ ఉద్యోగాల వర్క్ ఆర్డర్‌ను మూడు ఏజెన్సీలకు కేటాయించారు. అందులో ఎలెన్‌సాఫ్ట్ ఒకటి. ఈ ఏజెన్సీ ఎవరిదో ఇటు రిమ్స్ వర్గాలకు, అటు ఉపాధికల్పన శాఖలోని అధికారులు, సిబ్బంది అందరికీ స్పష్టంగా తెలుసు. గతేడాది జనవరిలో ఏసీబీ కేసులో పట్టుబడ్డ ఉపాధికల్పన శాఖ జూనియర్ అసిస్టెంట్ తేజ సోదరుడిది. పేరు సోదరుడిదే అయినప్పటికీ ఒకవిధంగా ఆ తేజకు ఆయన బినామీ అనే ప్రచారం ఉంది. అయితే ఆ ఏసీబీ కేసు విచారణ పూర్తయ్యిందా.. పట్టుబడ్డ వారు నిర్దోషులని నిరూపణ అయ్యిందా.. ఇవన్నీ పూర్తికాక ముందే ఆ ఏజెన్సీని తాజాగా ఎలా పరిగణలోకి తీసుకున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

– సాక్షి,ఆదిలాబాద్



జిల్లా కేంద్రంలోని ఉపాధికల్పన శాఖ కార్యాలయం

- అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు వర్క్ ఆర్డర్ కేటాయింపులో అనుమానాలు
- ఆరోపణలు ఉన్నవాటిని కూడా పరిగణనలోకి..
- వివాదాస్పదంగా ఉపాధికల్పన శాఖ తీరు
- ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి వసూళ్లు



అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు వర్క్ ఆర్డర్ కేటాయింపునలో ప్రామాణికం ఏమిటి.. ఉపాధికల్పన శాఖ ఎంప్యానల్మెంట్‌లో ఉన్న అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. ఒక ప్రభుత్వ శాఖలో వర్క్‌ఆర్డర్ పొందిన ఏజెన్సీ ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ప్రతినెల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఆ ఏజెన్సీకి టెండర్‌లో పొందిన శాతం ఆధారంగా కమీషన్ ఇస్తారు. ఎంప్యానల్మెంట్‌లో ఒక ఏజెన్సీని తీసుకున్న తర్వాత ఏదైనా ఆరోపణలు వస్తే దాని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సి ఉంటుంది. మరి ఏసీబీ కేసులో ఒక ఉద్యోగి పట్టుబడిన తర్వాత అతడికి సంబంధించిన వారి పేరుపై ఏజెన్సీ ఉన్న పక్షంలో దాన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సి ఉండగా, ప్రాధాన్యత క్రమంలో తీసుకొని వర్క్‌ఆర్డర్ ఇవ్వడంలో మతలబు ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది.

నియంత్రణ ఏది..

జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై నియంత్రణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాబ్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయంలో ఉట్నూర్‌కు చెందిన యువతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం, ఆయన ఈ విషయంలో వాకబు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత ఏజెన్సీలను నియంత్రించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంటుంది..? ఎంప్యానల్మెంట్‌ను పర్యవేక్షించే ఉపాధికల్పన శాఖ దీనిపై దృష్టి పెడుతుందా.. లేనిపక్షంలో ఏ శాఖలో వర్క్‌ఆర్డర్ పొందారో ఆ శాఖ ఉన్నతాధికారి ఇలాంటి వాటిపై మతలబేంటో తేల్చాలా అనే ప్రశ్న తలెత్తుతుంది.

ఇవన్నీ విషయాలు అధికారులకు తెలియదని చెప్పడానికి ఆస్కారం కూడా లేదు. ఎందుకంటే.. ఏసీబీ కేసు గతేడాది నమోదైంది. దాని గురించి ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్నతాధికారులకు స్పష్టంగా తెలుసు. అయినప్పటికీ ఆ ఏజెన్సీని ఎలా పరిగణలోకి తీసుకున్నారనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

అనేక ఏజెన్సీలు ఉన్నప్పటికీ..

ఎంప్యానల్మెంట్‌లో 17 ఏజెన్సీలు ఉన్నప్పటికీ తాజాగా మూడు ఏజెన్సీలనే పరిగణలోకి తీసుకోవడం కూడా వివాదాస్పదమవుతుంది. ఆ మూడు ఏజెన్సీలకే వర్క్ ఆర్డర్ ఎందుకు ఇచ్చారో.. తమను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని మిగితా ఏజెన్సీ నిర్వాహకులు ప్రశ్నించే పరిస్థితి. ఆరోపణలు ఉన్న ఏజెన్సీలను కూడా ఎలా పరిగణలోకి తీసుకుంటారని అడుగుతున్నారు. చిన్న చిన్న విషయాలకే ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అధికారులు ఏసీబీ కేసుతో సంబంధం ఉన్న ఏజెన్సీపై ఎందుకు మొగ్గు చూపుతున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నా దృష్టిలోనే లేదు..

రిమ్స్‌లో తాజాగా స్టాఫ్‌నర్స్ అవుట్‌సోర్సింగ్ నియామకాల విషయం నా దృష్టిలో లేదు. పాత ఏజెన్సీలనే రిమ్స్ వర్గాలు కంటిన్యూ చేస్తున్నాయి. స్టాఫ్‌నర్స్ రెగ్యులర్ ఉద్యోగాలు రావడంతో కొద్ది నెలల క్రితం అవుట్‌సోర్సింగ్ పోస్టులు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో ఆయా ఏజెన్సీలు తాజాగా భర్తీ చేసుకుంటున్నాయి. కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చారో.. లేదో నాకు తెలియదు. ఉపాధికల్పన శాఖకు సంబంధం లేకుండా ఈ వ్యవహారం సాగింది.

– మిల్కా, ఇన్‌చార్జి ఉపాధికల్పన శాఖ అధికారి

అర్హులందరికీ రుణమాఫీ



రుణమాఫీ అయ్యేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షాకు చేతులు జోడించి విన్నవిస్తున్న రైతు

- కలెక్టర్ రాజర్షిషా

తలమడుగు: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. మరమ్మతులు పూర్తి చేసిన తహసీల్దార్ కార్యాలయంను ప్రారంభించారు. అందులో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు రైతులు, గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి రుణమాఫీ సమస్యను విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ తప్పిదంతో పాటు కొన్ని బ్యాంకులు ఇచ్చిన తప్పుడు సమాచారం కారణంగా రైతులకు రుణమాఫీ జమ కాలేదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహిస్తున్నామని, అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, ఐకేపీ ఏపీఎం స్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో గణనాథునికి పూజలు చేస్తున్న కలెక్టర్

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. పట్టణంలోని భవిత రిసోర్స్ సెంటర్‌లో దివ్యాంగుల చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మానసిక వైకల్యం గల చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ చాలా మంది వాటి గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, ఐఈఆర్పీలు పుష్పవేణి, రాజన్న, వికలాంగుల సంఘం నాయకులు ఇమ్రాన్, సురేందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: అక్రమ అరెస్టులకు భయపడేది లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఎమ్మెల్యే గాంధీ ఇంటి ముట్టడికి వెళ్లి సమావేశం నిర్వహిస్తామని బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలను శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ, అతడి అనుచరులు చేసిన దాడికి పోలీసులు మద్దతు పలకడంతో పాటు దాడికి ఖండించిన మాజీ మంత్రులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేలకే రాష్ట్రంలో రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. అంతకుముందు ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై శ్రీకాంత్ పోలీసులతో కలిసి ఎమ్మెల్యేతో పాటు పలువురిని హౌస్‌అరెస్ట్ చేశారు.

'కాంగ్రెస్‌ది అప్రజాస్వామిక పాలన'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్‌ది అప్రజాస్వామిక పాలన అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. హైదరాబాద్‌లోని షేర్‌లింగంపల్లిలో గల ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ నివాసంలో పార్టీ సమావేశం నిర్వహిస్తామని బీఆర్ఎస్ పిలుపునివ్వగా పోలీసులు ముందస్తుగా జిల్లా కేంద్రంలో ని మాజీ మంత్రి జోగు రామన్న నివాసానికి వెళ్లి శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు పార్టీ నాయకులను సైతం అరెస్ట్ చే శారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడు తూ, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై అరికెపుడి గాంధీ గుండాలతో దాడికి పాల్పడ్డారని పే ర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులను అడ్డుకో కుండా ముందుండి వారికి పోలీసులు రక్షణ కల్పించారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వాన్ని నిలదీస్తే గుండాయిజం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.



రామన్నను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

పల్లె ఓటర్లు @ 4.41లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల
- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- ఈనెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 29న తుది జాబితా

కైలాస్‌నగర్: పల్లె ఓటర్ల లెక్క తేలింది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జీపీల్లో వార్డుల వారీగా సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ అధికారులు శుక్రవారం వెల్లడించారు. జిల్లాలోని 17 మండలాల్లో గల ఆయా పంచాయతీల పరిధిలో 4,41,700 మంది ఓటర్లు ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఈ జాబితాలను అన్ని జీపీల నోటీసుబోర్డులపై ఆయా కార్యదర్శులు పొందుపరిచారు. వీటిపై ఈ నెల 14 నుంచి 21వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 28 వరకు వాటిని పరిష్కరించి 29న తుది జాబితా ప్రకటించనున్నారు.

మహిళా ఓటర్లే అధికం

ఎస్ఈసీ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల్లో వార్డుల వారీగా జాబితాను పునర్విభజన చేశారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకేవార్డులో ఉండేలా జాగ్రత్తపడ్డారు. గత నెల 15నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా శుక్రవారం ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ ప్రకారం జిల్లాలో పురుష ఓటర్లు 2,16,242 మంది, మహిళా ఓటర్లు 2,25,443 మంది, ఇతరులు 15మంది ఉన్నారు. ఇందులో పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 9,201 మంది అధికంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండగా పంచాయతీ పాలకుల నిర్ణయంలోనూ వీరే కీలకం కానున్నారు. ఇక జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉట్నూర్ మండలంలో 50,508 మంది ఉండగా, అత్యల్పంగా మావల మండలంలో 4,123 మంది ఉన్నారు.

ఈనెల 29న తుది ఓటరు జాబితా

ఈ నెల 9వ తేదీనే ముసాయిదా జాబితా ప్రకటించాల్సి ఉండగా ఎన్నికల సంఘం అ సెంబ్లీ ఓటర్ల జాబితా పంపించడంలో ఆలస్యం కావడం, పూర్తిస్థాయిలో వార్డుల వారీగా పునర్విభజన జ రగకపోవడంతో దాన్ని 13వ తేదీకి వాయిదా వేశారు. ఈ మేరకు ఫొటోలతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం విడుదల చేశా రు. ఆయా పంచాయతీల్లోని నోటీసుబోర్డులపై అందుబాటులో ఉంచారు.



వాఘాపూర్ పంచాయతీ కార్యాలయంలో నోటీసుబోర్డుపై ముసాయిదా జాబితా పొందుపరుస్తూ..

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు : 473

మొత్తం వార్డులు : 3,870

21 వరకు అభ్యంతరాలు..

ఓటర్లు ఆ జాబితాలను పరిశీలించి ఏమైనా సందేహాలుంటే ఈ నెల 21వరకు అభ్యంతరాలను తెలుపవచ్చు. గడువులోగా అందిన వాటిని పరిశీలించి 28 వరకు వాటిని పరిష్కరిస్తాం. 29న తుది జాబితా ప్రకటిస్తాం. ఇప్పటి వరకు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోని వారుంటే సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. మార్పులు, చేర్పులు సైతం చేసుకోవచ్చు.

– జిల్లా పంచాయతీ అధికారి ఎస్.శ్రీలత

మండలాల వారీగా పంచాయతీ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆదిలాబాద్‌రూరల్	14,355	15,045	0
బజార్‌హత్నూర్	11527	11,908	0
బేల	15,588	15,595	0
భీంపూర్	9,181	9,936	0
బోథ్	18,074	19,451	1
గాదిగూడ	7675	8,046	0
గుడిహత్నూర్	12,130	12,615	0
ఇచ్చోడ	16,749	17,653	1
ఇంద్రవెల్లి	15,139	15,465	2
జైనథ్	19,202	20,047	0
మావల	1,976	2,147	0
నార్నూర్	11,394	11,474	4
నేరడిగొండ	11,391	12,166	0
సిరికొండ	6,939	7,167	0
తలమడుగు	13,381	14,143	0
తాంసి	6,502	7,123	0
ఉట్నూర్	25,039	25,462	7

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వినాయక నిమజ్జనాన్ని ఎలాంటి పొ ర పాట్లకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించే చాంద–వాగు,పెన్‌గంగ నదిని ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు పట్టణంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వెళ్లే రూట్ మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7, 9, 11వ రోజులలో వినాయక నిమజ్జనాలు ఎక్కువగా నిర్వహిస్తారన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం సాగేలా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలతో పాటు విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. చెరువులు, పెన్‌గంగ వద్ద క్రేన్లతో పాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్లు శ్రీనివాస్, సాయి మహేశ్ తదితరులు ఉన్నారు.



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

'పది' విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

జైనథ్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని మేడిగూడ కెనాల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు సంజీవ రెడ్డి, వినోద్ రావు, తదితరులున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వేదాంత్‌తో ప్రిన్సిపాల్, పీడీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన వేదంత్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆసిఫాబాద్‌లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వేదంత్ ప్రతిభ కనబర్చాడు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ లిబిన్, పీడీ రాకేశ్ శుక్రవారం అభినందించారు. హన్మకొండలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వేదంత్ పాల్గొంటారని వివరించారు. పీఈటీ కిరణ్, అర్చన, బద్రి ఉన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకొని ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉట్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..మండల కేంద్రంలోని పుకటన్‌నగర్ కాలనీకి చెందిన మల్లేశ్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలార్పి వేసి ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. కాగా, ఎస్సైని వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సోన్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కడ్తాల్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేశారు. 1100 గ్రాముల గంజాయి లభించింది. నిర్మల్ జిల్లా సోఫీనగర్‌కు చెందిన లక్ష్మణ్‌గా గుర్తించారు. గతంలో పలు దొంగతనాల కేసుల్లో ఉన్నారని తెలిపారు. నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సోన్ పోలీసులను డీఎస్పీ అభినందించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కె.గోపి, పోలీసులు ఉన్నారు.

సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగావకాశాలు

మంచిర్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల వారీగా సీఎస్సీ హెల్త్‌కేర్‌లో నియామకాలు చేపడుతున్నట్లు సీఎస్సీ స్టేట్ మేనేజర్ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్టీ, డీఎమ్మెల్టీ, బీఎస్సీ ఎమ్మెల్టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం అభ్యర్థులు సంబంధిత కోర్సులో పారామెడికల్ బోర్డులో రిజిష్టర్ చేసుకుని ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15న ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు మంచిర్యాలలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ కొండల్‌రావును 9989165691, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ 8977776143 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

యువత ఆర్థికంగా ఎదగాలి


ఉట్నూర్‌రూరల్: యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ ఎండీ గౌస్ అన్నారు. ఆర్‌సెటీలో బైక్ రిపేర్ శిక్షణ తీసుకున్న 30 మంది యువకులతో ఉట్నూర్ ఐబీలో శుక్రవారం ఉచిత బైక్‌ల సర్వీసింగ్ క్యాంపు నిర్వహించారు. శిక్షకులు ఎండీ షకీల్ ఉన్నారు.

జాతీయ సమైక్య భాష హిందీ

- జాతీయభాషగా గుర్తింపు
- భిన్న సంస్కృతుల వారధి హిందీ
- నేడు 'జాతీయ హిందీ దివస్'



నిర్మల్‌ఖిల్లా: భారతదేశం వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, నాగరికతలకు నెలవు. ప్రతీ రాష్ట్రానికి ప్రాంతీయ భాష ఉంటుంది. కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళ్తే భాష మరోలా ఉంటుంది. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేది భాష. దీని ద్వారా మరో వ్యక్తికి మనం చెప్పాలనుకునేది చేరుతుంది. దేశంలో అత్యధికుల నోళ్లలో నానే మాట, భిన్న సంస్కృతుల వారధి..కేంద్ర అధికారిక హోదా అందుకున్న భాష హిందీ. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని జాతీయ అధికారిక భాషగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రతీఏటా సెప్టెంబర్ 14న 'హిందీ దివస్'గా జరుపుకొంటున్నారు.



పదో తరగతి హిందీపుస్తకంలో నీటిప్రాధాన్యతను తెలిపే పాఠ్యాంశం

ఈ నేపథ్యంలో సాక్షి కథనం.

సాహితీవేత్తలు సైతం

హిందీభాషలో సూరదాసు సూర్యుడిగా, తులసీదాసు చంద్రుడిగా గుర్తింపు పొందారు. వీరు రాసిన సూర్‌సాగర్, రామచరితమానస్‌లు జీవగ్రంథాలుగా పేరుపొందాయి. మీరాబాయి కృష్ణుని భక్తిలో లీనమై రాసిన భజన పాటలు పదావళిలో ఉన్నాయి. సమాజంలోని దురాచారాలను తొలగించడానికి హిందీ ప్రజాకవి కబీర్‌దాస్ తోడ్పడ్డారు.

హిందీ నేపథ్యం..

- పర్షియన్ పదం 'హింద్'నుంచి హిందీ పుట్టుకొచ్చింది. ఇండస్ నదీ పారుతున్న నేలలో మాట్లాడే భాష అని దీని అర్థం. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన రెండు భాషల్లో హిందీ ఒకటి. ఇది దేవనాగరి లిపిలో ఉంటుంది. దేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ.
- ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో నాలుగోస్థానంలో ఉంది. భారత్‌లోనే కాదు.. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, న్యూజిలాండ్, యూఏఈ, ఉగాండా, గయానా, సురినామ్, ట్రినిడాడ్, మారిషస్, దక్షిణాఫ్రికాల్లో హిందీని జనం గణనీయ సంఖ్యలో మాట్లాడుతారు.
- కవులు, రచయితలు కాకా కాలేల్కర్, మైథిలీ శరణ్ గుప్తా, హజారీ ప్రసాద్ ద్వివేదీ, సేథ్ గోవింద్ దాస్, బియోహర్ రాజేంద్ర సింహ.. హిందీ అధికారిక భాషగా గుర్తింపు పొందడంలో విశేష కృషి చేశారు.
- 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ ఆ రోజుల్లో పొందుపర్చారు.

భిన్న సంస్కృతులకు నిలయం



భారతదేశం..వివిధ భాషలు భిన్న సంస్కృతులకు నిలయం. భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన భాష హిందీ. ప్రస్తుతం భారతీయ అధికార భాషగా గుర్తింపు పొందింది.

– ముత్యాల వాణి, హిందీ ఉపాధ్యాయురాలు

సంస్కృతిని ప్రతిబింబించే భాష



హిందీ భాష భారతీయ సంస్కృతిని ఇనుమడింపజేస్తుంది. హిందీలో నీతి కథలు, దోహా పద్యాలు విద్యార్థులకు పరిచయంతోనే భారతీయ సంప్రదాయాలు అవగతం అవుతాయి. పాఠశాల స్థాయి నుంచే హిందీపై అభిరుచిని పెంపొందించాలి.

– ఎం.సుందల్‌సింగ్, ఎస్ఏ, హిందీ, పరిమండల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

హిందీభాష వారసత్వ సంపద



హిందీ భాష భారతీయులందరి వారసత్వ సంపద లాంటిది. స్వాతంత్రోద్యమ కాలం నుంచి ఈ భాషకు ప్రాముఖ్యత ఉంది. హిందీ భాషాభివృద్ధికి విద్యార్థి దశ నుంచే ప్రోత్సాహం ఉండాలి.

– డా.అఖిలేశ్ కుమార్‌సింగ్, హిందీ భాషానిపుణుడు

సీఎస్పీలో దళారీ మోసం

- గిరిజన మహిళ వేలిముద్రతో రూ.30 వేలు డ్రా
- కుమారుడి సెల్‌ఫోన్‌కు సందేశం
- బ్యాంకు అధికారులను సంప్రదిస్తే విషయం వెలుగులోకి
- దళారీని చితకబాదిన బాధితురాలి కుమారుడు



మాడవి జంగుబాయి

నార్నూర్: గిరిజన మహిళను దళారీ మోసం చేసిన ఘటన నార్నూర్ మండల కేంద్రంలోని సీఎస్పీ సెంటర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గాదిగూడ మండలం రాంపూర్‌కు చెందిన మాడవి జంగుబాయికి రూ.1.30 లక్షల పంట రుణమాఫీ అయింది. రుణమాఫీ డబ్బుల్లో నార్నూర్ ఎస్బీఐలో ఆమె ఖాతాలో రూ.50 వేలు డిపాజిట్ చేసింది. మిగతా రూ.80 వేలకుగాను రూ.50 వేలు డ్రా చేసింది. మధ్యవర్తిగా ఉన్న దళారీ



ప్రభాకర్‌ను చితకబాదుతున్న బాధిత మహిళ కుమారుడు

పెందూర్ ప్రభాకర్ ఆమెకు బ్యాంక్ వోచర్ నింపడం, డ్రా చేయడం చేశాడు. డబ్బులు చెక్‌చేద్దామని ప్రభాకర్ ఆమెను నార్నూర్‌లోని సీఎస్పీ కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రభాకర్, నిర్వాహకుడు రవీందర్‌తో ఆమె ఆధార్ కార్డు, వేలిముద్రతో రూ.30 వేలు డ్రా చేశాడు. తర్వాత డబ్బులు జమ కాలేదని నిర్వాహకుడు చెప్పడంతో తిరిగివెళ్లింది. డబ్బులు డ్రా అయినట్లు ఆమె కుమారుడి సెల్‌ఫోన్‌కు మేసెజ్ వచ్చింది. అతను వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే అసలు విషయం తెలిసింది. ఆగ్రహానికి గురైన కుమారుడు..దళారీ అయిన ప్రభాకర్‌ను చితకబాదాడు.నిర్వాహకుడు రవీందర్ బాధిత మహిళకు రూ.30 వేలు అందించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసినట్లు సమాచారం.

ఆదిలాబాద్‌లో ఏబీఆర్ఎస్ఎం బృందం పర్యటన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: అఖిల భారతీయ మహా సంఘ్ బృందం సభ్యులు జిల్లా పర్యటనకు వచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్, సైన్స్ డిగ్రీ కళాశాల, సంజయ్ గాంధీ తదితర కళాశాలలను శుక్రవారం సందర్శించారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నవ భారత నిర్మాణంలో మహిళా 'విద్యావేత్తల పాత్ర'అనే అంశంపై కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి మహిళా లెక్చరర్లు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. వసంత గౌరి, శ్రీనివాస్, సరిత రాణి, నాగరాజు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలతో సామాజిక న్యాయం

ఖానాపూర్: తెలంగాణలో సామాజిక న్యాయం సమరశీల పోరాటాలతోనే సాధ్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్.ఉపాలి అన్నారు. పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో నైజాం నిరంకుశ పాలన అంతమైనయా దోపిడీ సాగుతోందని విమర్శించారు. వీరుల త్యాగాలను విస్మరించిన ప్రభుత్వం విలీన దినానికి ఎగనామం పెట్టిందన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే సమరశీల పోరాటాలే సరైన మార్గమని పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాలి

తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడుకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, అంకం శంకర్, పిట్టల భీమేశ్, చిన్న భీమేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి నుంచి కత్తి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి వాసి జానకొండ నారాయణ హత్యకేసులో ఇద్దరిని మహారాష్ట్రలోని మాండ్వి పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి పోలీసులు నిందితుడు దేవన్నను పిప్పల్‌కోటి గ్రామానికి తీసుకువచ్చి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. దేవన్న ఇంట్లో కత్తితోపాటు రక్తపు మరకలతో ఉన్న షర్టును స్వాధీనం చేసుకున్నారు. నారాయణ భార్య విజయలక్ష్మి కొన్ని ఆధారాలు దహనం చేసినట్లు గుర్తించారు. ఆ బూడిదను స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో పొట్టేలు మృతి

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో ఓ పొట్టేలు మృతి చెందింది. మునిగెల నర్సయ్యకు చెందిన మేకలు, గొర్రెలు గ్రామంలోని పాకలో కట్టేసి ఉన్నాయి. దాదాపు ఐదు కుక్కలు మందపై దాడి చేయగా ఓ పొట్టేలుకు గాయమైంది. మేకల అరుపులు విన్న స్థానికులు వచ్చి కుక్కలను తరిమారు. గాయపడిన పొట్టేలును ఆటోలో బోథ్‌లోని వెటర్నరీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా, గ్రామంలో కుక్కల బెడద నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందాడు. ఎస్సై కే.గోపి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌కు చెందిన జక్కుల రాకేశ్(29) తన అత్తగారింటికి వెళ్లేందుకు ముప్కాలకు బయల్దేరాడు. అక్కడి నుంచి నిర్మల్‌కు బస్సులో వెళ్లాడు. మార్గమధ్యలో గంజాల్ టోల్‌ప్లాజా వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్: మండలంలోని ఇందారం సమీపంలో టేకుమట్ల క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న లారీని అటువైపు వెళ్తున్న కారు వెనుక భాగం నుంచి వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన పూసపాటి ఆనంద్ తలకు తీవ్రంగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ఇంద్రవెల్లి మండలంలో యువకుడికి..



వెంకటిని రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కేస్లాపూర్ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ(జి) గ్రామానికి చెందిన హెరేకుంర వెంకటి సొంత పని నిమిత్తం బైక్‌పై ముత్నూర్ వెళ్లి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంత వద్ద కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి బైక్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటిని స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. వెంకటి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు.

కోతులదాడిలో వృద్ధురాలికి..

నర్సాపూర్(జి): కోతుల దాడిలో మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గూండ్ల నాగమ్మ (65) గాయపడింది. ఒకరి ఇంట్లో పని చేస్తుండగా శుక్రవారం కోతులు మూకుమ్మడి దాడిలో ఆమె కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో కోతుల బెడద అరికట్టేలా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శుక్రవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడారు. మ్యాన్‌రైడింగ్ చైర్స్ రబ్బర్స్ సరిపడా లేకపోవడంతో చైర్స్‌ను తక్కువ పెట్టి నడిపిస్తున్నారని తెలిపారు. గనిపై ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఆయా సమస్యలను వారు గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కరిస్తామని హామీ



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

ఇచ్చారు. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరి, అంబాల రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రోమోజీ, కాజీపేట విక్కి, ఆడెపు సురేశ్ ఉన్నారు.

నిరంతర సాధనతో క్రీడానైపుణ్యాలు మెరుగు

రెబ్బెన: క్రీడాకారులు నిరంతర సాధనతోనే క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చునని బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల నియర్ బై ఏరియా టెన్నీస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రతి ఏరియాలో క్రీడాకారులకు కావల్సిన అన్ని వసతులు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులందరూ ఆటల్లో రాణించాలన్నారు. బెల్లంపల్లి, మందమర్రి ఏరియాకు చెందిన క్రీడాకారులు కంపెనీ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికై



టెన్నీస్ పోటీలు ప్రారంభిస్తున్న భీంరావు జాడే

పతకాలు సాధించాలన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యు మొగిళి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంటు నుంచి ఆగిన దుమ్ము ధూళి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నుంచి వస్తున్న దుమ్ముధూళి ఆగిందని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనిట్–2 క్యాపిటల్ ఓవర్‌హాలింగ్‌లో భాగంగా 84 రోజులు మరమ్మతు చేపట్టి ఆయిల్‌తో లైటాప్ చేయడంతో రెండు గంటలు దుమ్ము ధూళి వచ్చిందన్నారు. తర్వాత అది ఆగిందని తెలిపారు. సోషల్ మీడియాలో ప్లాంటు నుంచి దుమ్ము ధూళి వస్తుందని ప్రచారం జరిగిందన్నారు. ఈనెల 9న అధికారులు చుట్టుపక్కల గ్రామాలు, ఎస్టీపీపీ పరిసర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ పరికరం పీఎం 10 ద్వారా మానిటర్ చేసి రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. ప్లాంటు నుంచి వెలువడుతున్న దుమ్ము ఎన్ఏఏక్యూఎస్ ప్రకారం నియమ నిబంధనలకు లోబడి ఉందని తెలిపారు. ఎలాంటి విష వాయివులు, కానీ వ్యర్థాలు కానీ వెలువడం లేదని పేర్కొన్నారు.



ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు

బండల నడుమ చేపల వేట!



మత్స్యకారులు ఉపాధి వేటలో ప్రమాదాలను సైతం లెక్కచేయడం లేదు. నార్నూర్ మండలం కుండాయి జలపాతంలో బండరాళ్ల నడుమ శుక్రవారం ఇలా చేపల వేట సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా అంతే సంగతులు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అలంకారప్రాయంగా పల్లె దవాఖానా



ప్రజలకు స్థానికంగానే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా పట్టణంలోని న్యూహౌజింగ్‌బోర్డులో పల్లె దవాఖానా నిర్మించింది. భవనం పూర్తయి ఏడాది గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో అలంకారప్రాయంగా మారింది. సుందరమైన భవనం కన్పిస్తున్నా అక్కడ వైద్యసేవలు అందకపోవడం రోగులకు ఇబ్బందిగా మారింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా..?

- కలెక్టర్ ఆగ్రహంతో నోటీసులు జారీ
- మిగతా సర్వే నంబర్ల సంగతి ఏమిటి..?

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని 840 సర్వేనంబరు గెర్రెకాలనీ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లు, ఇళ్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. స్థానిక తహసీల్దార్ గుర్తించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందజేస్తూ మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఎలా వచ్చింది, స్థలం పత్రాలు అందజేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలపై రెండేళ్ల క్రితం నోటీసులు జారీ చేసినా ఆ తర్వాత ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవల చెన్నూర్‌లో అమృత్ 2.0 వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల భూమి పూజకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, వివేక్‌లతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. పక్కనే ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు జారీ



గెర్రె కాలనీలో గుర్తించిన అక్రమ నిర్మాణాలు

చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా అని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ కూల్చేస్తే మిగతా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల సంగతి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో కిష్టంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ భూముల్లో 50 ఇళ్ల అక్రమ నిర్మాణాలను అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. కాగా, గెర్రెకాలనీలో 22 మందికి నోటీసులు జారీ చేయగా 10 మంది భూమికి సంబంధించిన కొనుగోలు పత్రాలు, ఇంటి నంబర్లు, ఇతర అనుమతి పత్రాలతో బదులు ఇచ్చారని మున్సిపల్ అధికారులు తెలిపారు. నోటీసు అందుకున్న వారంతా సంజాయిషీ పత్రాలు అందజేసిన తర్వాత కలెక్టర్‌కు నివేదిస్తామని కమిషనర్ గంగాధర్ తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వివిధ రంగాల్లో మైనార్టీలకు వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్‌స్ట్రక్షన్, వెటర్నరీ–డెయిరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్ తదితర శిక్షణకు భాగస్వాములుగా నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు దరఖాస్తులను హైదరాబాద్–నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4న సాయంత్రం 5 గంటల్లో సమర్పించాలని తెలిపారు. వివరాలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.